క్లుప్తంగా

నీటి సరఫరా పునరుద్ధరణ



నల్లా ద్వారా వస్తున్న నీరు

సాక్షి స్పందన

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలోని రామాలయం కాలనీలో గత ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదు. దీంతో కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులపై శుక్రవారం సాక్షిలో 'రామాలయం కాలనీలో నీటి ఎద్దడి'శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాలనీలో నీటి సరఫరాను పునరుద్ధరించారు. అదేవిధంగా చేతిపంపు బోర్లకు మరమ్మతు చేపట్టాలని కాలనీవాసులు కోరారు. కాలనీలో నీటి ఎద్దడి లేకుండా చేస్తామని ఏఈ కళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు.

'కంది'పై వ్యక్తిగత దూషణలు అరికట్టాలి



ఎస్సైకి ఫిర్యాదు ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డిపై సోషల్ మీడియాలో కొందరు బీజేపీ నాయకులు చేస్తున్న వ్యక్తిగత దూషణలను అరికట్టాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. శుక్రవారం మావల ఎస్సై విష్ణువర్ధన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీధర్ మాట్లాడుతూ కంది శ్రీనివాసరెడ్డి అన్ని వర్గాలు, కులాలు, మతాలను కలుపుకొని వెళ్లే నేతనని పేర్కొన్నారు. ఆయనకు అన్నివర్గాల ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీ నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ఆయా పార్టీల నాయకులు అసత్య ఆరోపణలు మానేయాలన్నారు. నాయకులు ఏవన్, దొగ్గలి రాజేశ్వర్, మర్సుకోల గౌతమ్ తదితరులు ఉన్నారు.

బీజేపీ నాయకులపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జైనథ్: కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డిపై సోషల్ మీడియా వేదికగా పలువురు బీజేపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారంటూ కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. గంగ్రత్ మహేందర్, గటిక క్రాంతి, గంగ్రత్ సంతోష్, బండారి సంతోష్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్సై పురుషోత్తంను కలిసి శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేశారు. నాయకులు అల్లూరి అశోక్‌రెడ్డి, అడ్డి రుకేష్‌రెడ్డి, కొడిచర్ల సుదర్శన్, గడ్డం జగదీశ్‌రెడ్డి, బద్దం సురేష్‌రెడ్డి, సామ జగదీశ్‌రెడ్డి, వెంకన్న యాదవ్, కొడిచర్ల లస్మన్న, పిడుగు స్వామి, తదితరులు ఉన్నారు.

ఇతరులతో పని చేయించొద్దని వినతి

బోథ్: బోథ్ మార్కెట్ యార్డులో జొన్న కొనుగోళ్లలో తమ బంధువులతో పనులు చేయించొద్దని పలువురు హమాలీలు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు వినతిపత్రం అందించారు. శుక్రవారం మార్కెట్ యార్డుకు వచ్చిన ఎమ్మెల్యేకు కలిసి తమ సమస్యలను తెలియజేశారు. ఇతరులతో హమాలీ పని చేయించవద్దని కోరారు. హమాలీల సమస్యలపై మార్కెట్ కమిటీ ప్రత్యేక కార్యదర్శి నార మనోహర్‌తో చర్చించారు. వారి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ అర్బన్ మండల పరిధిలోని 33/11 కేవీ కైలాసనగర్, రాంపూర్ సబ్‌స్టేషన్లలో మరమ్మతు కోసం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-3 ఏఈ డి.శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని శాంతినగర్ ఏరియా, కైలాసనగర్, ఓల్డ్ హౌసింగ్‌బోర్డు, ఆర్ఆర్‌నగర్, కుమ్మరివాడ, అటెండర్స్ కాలనీలో ఖుర్షిద్‌నగర్, రణదివేనగర్, సుందరయ్యనగర్, నీలా నగర్, గాంధీనగర్, హరిఓంనగర్, రాంపూర్, ఇండ్రస్టియల్ ఏరియాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

బోథ్‌లో..

బోథ్: మండలంలోని పొచ్చెర, సొనాల సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ వెంకటేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

ఇసుక అక్రమ దందా!

- ప్రభుత్వ స్థలంలో ప్రైవేట్ వ్యాపారి దందా
- భారీగా డంప్, దర్జాగా విక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



సాత్నాల క్వార్టర్స్‌లోని ఇసుక అక్రమ దంపు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగా అక్రమ ఇసుకదందా యథేచ్ఛగా సాగుతోంది. ఓ వ్యాపారి జైనథ్, బేల మండలాల్లోని పెన్‌గంగా నది తీరం నుంచి తీసుకువచ్చిన ఇసుకను స్థానిక ప్రభుత్వ స్థలమైన సాత్నాల క్వార్టర్స్‌లోని ఆవరణలో నిల్వ చేస్తున్నారు. అధికారులకు ఎలాంటి అనుమానం తలెత్తకుండా వ్యవహరిస్తూ అక్రమంగా విక్రయాలు సాగిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. అధికారుల కళ్లెదుటే ఇంత జరుగుతున్నా పట్టింపులేనితనంగా వ్యవహరిస్తుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ నిర్మాణాన్ని సాకుగా చూపుతూ..

సాగునీటి పారుదలశాఖకు చెందిన సాత్నాల క్వార్టర్స్‌లో ప్రభుత్వానికి సంబంధించిన సమీకృత ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని చేపడుతున్నారు. అయితే దీని నిర్మాణ పనులు గతేడాది నిలిచిపోయాయి. కానీ సదరు వ్యాపారి ఈ నిర్మాణాన్నే సాకుగా చూపిస్తూ జైనథ్, బేల మండలాల్లోని పెన్‌గంగా నది సరిహద్దు ప్రాంతం నుంచి టిప్పర్ల ద్వారా భారీగా ఇసుకను తరలిస్తూ ఆ ప్రాంతంలో పెద్దఎత్తున నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా విక్రయాలు సాగిస్తున్నారు. ఈ దందా రాత్రి,పగలు అనే తేడా లేకుండా గతేడాదిన్నర కాలంగా జరుగుతుంది. ఎవరైనా అటువైపుగా వస్తే ఎలాంటి అనుమానం తలెత్తకుండా సదరు వ్యాపారి జాగ్రత్త పడుతున్నారు. విక్రయాలను పర్యవేక్షించేందుకు నియమించుకున్న సిబ్బందితో ఈ ఇసుక డంపు సమీకృత మార్కెట్ నిర్మాణ పనుల కోసమని బుకాయిస్తూ ఎలాంటి అనుమానం రాకుండా జాగ్రత్త పడుతున్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఇసుకను నిల్వ ఉంచడమే తప్పైతే గతేడాది కాలంగా దర్జాగా సదరు వ్యాపారి దందాను కొనసాగిస్తున్నారు. దీనిపై చర్యలు చేపట్టాల్సిన రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ అక్రమ దందాలో వారికి వాటాలు అందడంతో అటువైపుగా కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సామాన్యులపై భారం

అక్రమంగా డంప్ చేసిన ఇసుకను తన ఇష్టారాజ్యంగా విక్రయాలు సాగిస్తున్నారు. టిప్పర్ ఇసుకకు రూ.18 వేలు తీసుకుంటుండగా, ట్రాక్టర్‌కు రూ.4600 నుంచి 5వేల వరకు విక్రయిస్తున్నారు. దీంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన సామాన్య, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర భారం పడుతోంది. పట్టణంలోని పలు నిర్మాణాలకు ఇక్కడి నుంచే ఇసుక తరలిపోతోంది. రాత్రిపూట పెద్దఎత్తున డంప్ చేస్తూ మరుసటి రోజు మధ్యాహ్నం వరకు ఖాళీ చేస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో సాగుతున్న ఈ అక్రమ వ్యాపారంపై అధికారులు పట్టించుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా విషయమై ఆదిలాబాద్ అర్బన్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యజువేందర్ రెడ్డిని 'సాక్షి'ఫోన్‌లో సంప్రదించగా ఈ విషయంపై ఇప్పటివరకు తమ దృష్టికి రాలేదన్నారు. ప్రభుత్వ స్థలంలో నిల్వ ఉంచడం, విక్రయించడం నేరమని, దీనిపై విచారించి చర్యలు తీసుకుంటామని పేర్కొనడం గమనార్హం.

అభివృద్ధికి ఆమడదూరం

- జైనూర్ పల్లెలో దుస్థితి
- అందని మిషన్ భగీరథ నీరు
- రోడ్లు..మురుగుకాల్వలు లేవు
- ఇబ్బందుల్లో గ్రామస్తులు



జైనూర్ పల్లె గ్రామం

బోథ్: మండలంలోని జైనూర్ పల్లె గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. నాగాపూర్ గ్రామానికి 2 కి.మీ దూరంలో ఉంది. దాదాపు 45 ఏళ్ల కిందట ఈ గ్రామం ఏర్పడగా, అన్ని ఆదివాసీ కుటుంబాలే ఉన్నాయి. గ్రామంలో ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు. సీసీ రోడ్డు, మురుగుకాల్వలు లేవు. మిషన్ భగీరథ నీరందకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు, మురుగుకాల్వలు నిర్మించాలని ఎవరికి చెప్పాలో కూడా వారికి తెలియని పరిస్థితి. ఏడాది క్రితం ఒకసారి పెద్ద సార్లు వచ్చి భగీరథ నీరు వస్తుందో లేదో చూసి వెళ్లారు. అప్పటినుంచి నల్లా నీరు రావడం లేదని 'సాక్షి'తో తమ గోడు వెళ్లబోసుకున్నారు.

చుక్కనీరు అందించని భగీరథ

జైనూర్ పల్లెలో మిషన్ భగీరథ పథకంలో భాగంగా నీటి ట్యాంకు నిర్మించారు. ఇంటింటికీ నల్లాలు అమర్చారు. ట్యాంక్ నుంచి ఇంటింటికీ నీరు వస్తుందో లేదోనని అధికారులు పరీక్షించి వెళ్లిపోయారు. అప్పటి నుంచి నీరు రావడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ బోరు నుంచి సొంత ఖర్చులతో పైపులను వేసుకుని నీటిని తెచ్చుకుంటున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా మినీ అంగన్‌వాడీ కేంద్రానికి తలుపులు లేవు. పశువులు లోపలికి వెళ్లి మలమూత్ర విసర్జన చేస్తున్నాయి. తడకలకు మినీ అంగన్‌వాడీ బోర్డును తగిలించారు.

రోడ్లు, మురుగుకాల్వలు లేవు

గ్రామంలో మురుగుకాల్వలు, సీసీ రోడ్డు చేపట్టలేదు. ఇంటి నుంచి వచ్చే వ్యర్థపు నీరు ఇంటి పక్క నుంచి బయటకు వెళ్లడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. తమ గ్రామంలో మురుగుకాల్వలు నిర్మించేలా ఇప్పటికైనా సంబంధితశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చర్యలు చేపట్టాలి



గ్రామంలో సీసీరోడ్డు, మురుగుకాల్వలు లేవు. మురుగునీరు రోడ్డుపై చేరడంతో దుర్వాసన వస్తుంది. సీసీ రోడ్లు, మురుగుకాల్వలు నిర్మించేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– సురేష్, గ్రామస్తుడు

నష్టపోయిన బాధితులను ఆదుకుంటాం



హనుమాన్‌నగర్‌లో కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని హనుమాన్‌నగర్, ఎక్స్‌రోడ్ కాలనీలో ఈదురుగాలులు, వర్షబీభత్సంతో నష్టపోయిన బాధితులను ఆదుకుంటామని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆయా కాలనీల్లో శుక్రవారం పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఎవరూ ఆధైర్య పడవద్దన్నారు. కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జరిగిన నష్టాన్ని అంచనా వేసి నివేదిక అందజేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండే, నాయకులు తిరుమల్‌గౌడ్, జాదవ్ రమేశ్, భీంరావు, రవీందర్ నాయక్, ఆశన్న, కేంద్రే వెంకటరావు, దోమకొండ సుధాకర్ తదితరులు ఉన్నారు.

వర్షానికి లేచిన పైకప్పు రేకులు



పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇంద్రవెల్లి: మండలంలో బుర్సన్‌పటర్‌లో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి ఇళ్ల పైకప్పు రేకులు లేచిపోయాయి. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు శుక్రవారం బాధితుల ఇళ్లను పరిశీలించారు. వారితో మాట్లాడి జరిగిన నష్టం వివరాలను తెలుసుకున్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా ఆర్థికసాయం అందేలా చూస్తామన్నారు. మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, నాయకులు ఎండీ మసుద్, జితేందర్, సోమోరే నాగోరావ్, ఫీరాజీ తదితరులు ఉన్నారు.

విరిగిపడ్డ చెట్టు తొలగించరూ..



బోథ్: ఈదురుగాలులతో కురిసిన వర్షానికి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై చెట్టు విరిగిపడింది. రెండు రోజులవుతున్నా అధికారులు తొలగించడం లేదు. దీంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రివేళలో వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. అధికారులు చెట్టును తొలగించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అసంపూర్తిగా భవనం



కిటికీలకు కట్టిన పరదా



తలుపులు లేకుండా ఉన్న మూత్రశాల

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవనానికి కిటికీలు, మూత్రశాలకు తలుపులు లేవు. ఇటీవల కురిసిన వర్షానికి నీరు భవనంలో చేరడంతో సిబ్బంది ఇక్కట్లు పడ్డారు. కనీసం మూత్రశాలకు తలుపు లేకపోవడంతో ఒంటికి వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. కరెంట్ సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఉక్కపోతకు గురవుతున్నారు. కిటికీలకు తలుపు లేకుండా పరదా కట్టి ఉంచారు. పొచ్చెర, కనుగుట్ట, సాయినగర్‌లకు వైద్య సదుపాయాలు అందించే ఆరోగ్య ఉప కేంద్ర భవనం పైకి అందంగా కనపిస్తున్నా..లోపల చేయాల్సిన పనులు చాలానే ఉన్నాయి. అసంపూర్తిగా ఉన్న భవనం పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెరువు మట్టి.. పొలానికి పుష్టి



పొలంలో చెరువు మట్టిన వేసిన దృశ్యం

నేరడిగొండ: రైతులు వినియోగిస్తున్న రసాయనాలతో పొలాల్లోని సారం తగ్గుతోంది. ఏటా వాటి వినియోగం పెరుగుతూనే ఉంది. ఈనేపథ్యంలో నేలలోని పోషకాలు పంటకు అందాలంటే చెరువు మట్టి, సేంద్రియ ఎరువుల వాడకంతోనే సాధ్యమని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. చెరువు మట్టిలో ఖనిజ లవణాలు, మూలకాలు, సేంద్రియ కార్బనం, నత్రజని, భాస్వరం, పొటాష్, ఊదజని వంటివి అధికంగా ఉంటాయని చెబుతున్నారు. ఇవన్నీ పొలంలో నాటిన విత్తనం పెరగడానికి బలాన్ని చేకూరుస్తాయని అంటున్నారు. వానలు కురిసినప్పుడు వివిధ పోషకాలు చెరువు మట్టిలో కలిసిపోతాయి. దీంతో పలువురు ఈ చెరువు మట్టిని పొలాల్లో వేసుకుంటున్నారు. ఈ మట్టితో పంటకు కావల్సిన పోషకాలు అంది మంచి దిగుబడి అందుతుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అశోక్

బేల: పాఠశాలల పునఃప్రారంభానికి ముందే రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఎంఆర్సీ కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతోపాటు యూనిఫారాలు పాఠశాలల పునఃప్రారంభానికి అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు వెంటనే రెమ్యూనరేషన్ విడుదల చేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై నారాయణఖేడ్ ఆర్డీవో అకారణంగా పోలీసులతో లాఠీచార్జి చేయించారని, ప్రభుత్వం అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలోజిల్లా అధ్యక్షుడు స్వామి, జిల్లా కార్యదర్శి శివన్న, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కొల్లూరు శంకర్, మండల అధ్యక్షుడు జయకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు



గుడిహత్నూర్: మాట్లాడుతున్న ఏవో రేవతి

గుడిహత్నూర్: మండలంలోని పెస్టిసైడ్స్, విత్తన విక్రయదారులు నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన పురుగుమందులు విక్రయిస్తే దుకాణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఏవో రేవతి హెచ్చరించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో డీలర్లతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విత్తనాలు విక్రయించినప్పుడు రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. స్టాక్ వివరాలతోపాటు ధరల వివరాలను ప్రతిరోజూ బోర్డుపై నమోదు చేయాలని సూచించారు. నిర్ణయించిన కన్నా అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏఈవో శ్రీధర్, వెంకటి, విక్రయ డీలర్లు పాల్గొన్నారు.

తాంసి: ప్రభుత్వ గుర్తింపు పొందిన పత్తి, ఇతర విత్తనాలను రైతులకు విక్రయించాలని ఏవో రవీందర్ సూచించారు. మండలంలోని బండల్ నాగపూర్ రైతు వేదికలో విత్తన దుకాణాల యజమానులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యజమానులకు పలు సూచనలు చేశారు. రైతులకు విక్రయించిన విత్తనాలకు సంబంధించి బిల్లులు అందించాలన్నారు. దుకాణాల వద్ద స్టాక్‌బోర్డులో వివరాలు నమోదు చేయాలన్నారు. వ్యవసాయశాఖ నిబంధనలకు అనుగుణంగా విక్రయాలు చేపట్టాలన్నారు. ఏఈవోలు వెంకటేశ్, యోగిరాజ్, సుప్రియ, శివప్రసాద్, విత్తన దుకాణాల యజమానులు ఉన్నారు.

అధిక రక్తపోటును నియంత్రించవచ్చు



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సాగర్

ఇచ్చోడ: అధిక రక్తపోటును కొన్ని పద్ధతుల ద్వారా నియంత్రించవచ్చని ఇచ్చోడ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవ సందర్భంగా శుక్రవారం అవగాహన కల్పించారు. అధికంగా కొవ్వు ఉండే ఆహార పదార్థాలు, అధికంగా ఉప్పు ఉండే ఆహార పదార్థాలను తీసుకోవద్దని సూచించారు. రోజు 30 నిమిషాలు వాకింగ్, ధ్యానం అలవాటు చేసుకుంటే రక్తపోటును నివారించవచ్చ తెలిపారు. 30 ఏళ్లు పైబడిన వారు క్రమం తప్పకుండా నెలకోసారి బీపీ పరీక్షించుకోవాలని, ఇలా చేయడంతో అధిక రక్తపోటును ప్రారంభ దశలో గుర్తించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలి



పీవోకు వినతిపత్రం అందిస్తున్న నాయికులు

ఉట్నూర్‌రూరల్: జైనూర్ మండల కేంద్రంలో ఇటీవల ఆదివాసీ యువకుడిపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ హక్కుల పోరామమితి తుడుందెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా గాయాలపాలైన మర్సుకోల లక్ష్మణ్‌ను ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్, సంఘ నాయకులు రేణుక, పుష్పరాణి, బాదిరావు, వరుణ్ ఉన్నారు.

గుడిహత్నూర్: ఆదివాసీలపై దాడులు చేస్తే సహించబోమని ఆదివాసీ సేనా జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగు ఓ ప్రకటనలో హెచ్చరించారు. జైనూర్ మండల కేంద్రంలో ఆదివాసీ యువకుడు మర్సకోల లక్ష్మణ్‌పై కొందరు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డుపై మురుగునీరు



ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని అంజీరోడ్, జీసీసీ పెట్రోల్‌బంక్ ఎదుట రోడ్డుపై మురుగునీరు చేరుతోంది. దీంతో ప్రయణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు వెంటనే పట్టించుకుని మురుగునీరు రోడ్డుపై రాకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కంది శ్రీనివాసరెడ్డిపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న బీసీ సంఘం నాయకులు

తాంసి: కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డిపై తాంసి పోలీస్‌స్టేషన్‌లో బీసీ సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. ఇటీవల గంగ్రత్ సుజాతపై శ్రీనివాస్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిరసిస్తూ శుక్రవారం తాంసిలో నిరసన వ్యక్తం చేశారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో కంది దిష్టిబొమ్మ దహనం చేశారు. బీసీ సంఘాల నాయకులు సంతోష్, అశోక్, మహేందర్, అరుణ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న అశోక్ మహరాజ్

నేరడిగొండ: మండలంలో నేటి నుంచి జరగనున్న నేరడిగొండ ప్రీమియర్ లీగ్‌లో యువ క్రీడాకారులను ప్రోత్సహించడానికి కోర్టికల్‌లోని యూపీ దాబా యజమాని అశోక్ మహరాజ్ స్పార్టన్ వారియర్స్ జట్టు సభ్యులకు శుక్రవారం క్రీడా దుస్తుల కోసం రూ.10వేల నగదు అందజేశారు. క్రీడాకారులకు అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. జట్టు కెప్టెన్ అనిల్‌కుమార్, లీగ్ నిర్వాహకులు జాదవ్ పవన్ కుమార్, లఖన్, మణిరాజ్, పాండు, యోగి, జైరాం పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసమే భరోసా



మాట్లాడుతున్న శృతి

ఇచ్చోడ: ఆత్మ విశ్వాసమే మహిళలకు భరోసా అని శిక్షకురాలు శృతి అన్నారు. మండల కేంద్రంలో వైష్ణవసదన్ పీఠాధిపతి నారాయణ్ మహరాజ్ ఆధ్వర్యంలో మహిళలకు ఆత్మరక్షణ, సురక్ష, సాంస్కృతిక పరిరక్షణపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారాయణ మహరాజ్ ఆధ్వర్యంలో మహిళలు, యువతులకు పలు అంశాలపై వారం పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ ఉపాధ్యాయులు కల్పన, మంజుల, లత, అంజలి పాల్గొన్నారు.